

ఎరువులు, జీలుగ విత్తనాల పంపిణీ షురూ

సిరికొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించే పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ విత్తనాల పంపిణీని ప్రారంభించింది. శనివారం మండలంలోని సహకార సంఘాల పరిధిలోని రైతులకు పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. సిరికొండలో పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లెం గంగాధర్, తూంపల్లి పీఏసీఎస్‌లో అధ్యక్షుడు మాలవత్ రాములు నాయక్, గడ్కోల్లో హొన్నాజీపేట్ పీఏసీఎస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ

పశువుల అక్రమరవాణాపై నిఘాపెట్టాలి

- బక్రీద్ సందర్భంగా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, సీపీ

నిజామాబాద్‌అర్బన్,మే17 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమరవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీహన్మంతు, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన శనివారం సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశువుల అక్రమరవాణా నిరోధం, జంతుసంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీ సమీక్షించారు. బక్రీద్‌పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతుసంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం 1977 ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉందని, తెలంగాణాలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉందని సూచించారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను స్లాటర్ హౌజ్ లలోనే వధించాలని, రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్నిచోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాలూర, పొతంగల్, ఖండ్‌గావ్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు, సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని సీపీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే సీజ్‌చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదు వచ్చినవెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాటాపూర్, ఇందల్వాయి తదితరచోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా, పశుసంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా రవాణాశాఖ అధికారి ఉమామహేశ్వర రావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏ.సీ.పీలు రాజా వెంకటరెడ్డి, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే జిల్లా రికార్డు

- ఈ యాసంగిలో జిల్లాలో అత్యధికంగా ధాన్యం సేకరణ
- రాష్ట్రంలో 51లక్షల 39వేల 185 మెట్రిక్ టన్నుల సేకరణ
- ఇందులో జిల్లా వంతు 8లక్షల 1019వేల మెట్రిక్ టన్నులు
- వారం రోజుల్లో మిగతా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారుల ఏర్పాట్లు



నిజామాబాద్, మే17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధాన్యం కొనుగోళ్లలో జిల్లా రికార్డును బ్రేక్ చేసింది. రాష్ట్రస్థాయిలో ఈ యాసంగిలో అత్యధికంగా జిల్లాలో కొనుగోలు చేశారు. నిర్ణయించిన లక్ష్యానికి చేరువయ్యారు. రాష్ట్రంలోని 32 జిల్లాలకు ఈ యాసంగిలో టార్గెట్ ఇవ్వగా.. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం ప్రకారం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యంలో అత్యధికంగా జిల్లా నుంచే సేకరించారు. ధాన్యం సేకరణలో నల్గొండ రెండోస్థానంలో ఉండగా మిగతా ధాన్యాన్ని కూడా సేకరించేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు గోదాములు, మిల్లుల్లో నిలువ ఉంచేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతుల నుంచి మిగిలిన ధాన్యాన్ని వారం రోజుల్లోగా సేకరించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా..

ఈ యాసంగిలో ధాన్యం 32 జిల్లాల పరిధిలో సేకరిస్తుండగా ఇప్పటివరకు సేకరించిన ధాన్యంలో జిల్లాదే రికార్డు. అన్ని జిల్లాల్లో కంటే ముందుండి మిగతా జిల్లాలు అందుకోని విధంగా జిల్లాలో అత్యధికంగా సన్నరకం ధాన్యాన్ని జిల్లా అధికారులు సేకరించారు. రాష్ట్రంలో 32 జిల్లాల పరిధిలో ఈ సీజన్‌లో 71వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అన్ని జిల్లాల పరిధిలో మొత్తం 8353 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 51లక్షల 39వేల 185 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. జిల్లాలో ఎప్పుడు లేని విధంగా ఏ సీజన్‌లో కొననంత ధాన్యాన్ని ఈ సీజన్‌లో కొనుగోలు చేశారు. మొత్తం 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఈ యాసంగిలో లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 8లక్షల 1019 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రాష్ట్రంలో జిల్లాలోనే అత్యధికంగా ఈ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యంలో 90 శాతంకు పైగా సన్నరకాన్ని సేకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 7లక్షల 15వేల 279 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం సేకరించగా దొడ్డురకం 85వేల 739 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సీజన్‌లో కొన్న ధాన్యంలో సన్నరకం మొత్తం 17లక్షల 37వేల 216 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా అందులో 40 శాతంకు పైగా జిల్లా నుంచే సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సీజన్‌లో 32 జిల్లాల పరిధిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న నిజామాబాద్ జిల్లా తర్వాత స్థానంలో నల్గొండ జిల్లా నిలిచింది. ఈ జిల్లాలో ఇప్పటి వరకు 5లక్షల 25 వేల 159 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి వరకు 8511 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. వీటిలో అత్యధికంగా 1578 కోట్లు (తరువాయి 8వ పేజీలో..)



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. రైతుల నుంచి కొనుగోలు చేయడంతో పాటు వెంటనే ధాన్యం తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు (తరువాయి 8వ పేజీలో..)

గుండెపోటుతో 16 ఏళ్ల బాలుడి మృతి

- డొంకేశ్వర్‌లో విషాదం



వడ్ల శివ (ఫైల్)

డొంకేశ్వర్, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో 16 ఏళ్ల బాలుడు మృతిచెందిన విషాదఘటన జిల్లాలోని డొంకేశ్వర్ మండలంలో శనివారం చోటు చేసుకుంది, వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్‌కు చెందిన వడ్ల శివ (16) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో శివ ఏ గ్రేడ్ ఫలితాలు సాధించాడు. అయితే శనివారం ఉదయం 4గంటల సమయంలో ఇంట్లోనుంచి విపరీతంగా దగ్గుతూ శ్వాస అందక రోడ్డు మీదకు వచ్చాడు. ఏకధాటిగా దగ్గుతూనే శ్వాస అందక రోడ్డుపైనే కుప్పకూలి పడిపోయాడు. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు యత్నించారు. అయితే అదే సమయంలో గుండె పోటురావడంతో శివ మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. శివది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులే చందాలు చేసి అంత్యక్రియలు నిర్వహించారు.కాగా 16 ఏళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

- సీఎం సహా మంత్రులు, సీనియర్ నేతలంతా కలిసి పనిచేస్తున్నారు
- కావాలనే ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నేతల తప్పుడు ఆరోపణలు
- మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను వక్రీకరించిన వారిపై కేసులు పెడతా
- ఈనెల 26 లేదా 27న పీసీసీ కార్యవర్గం ఖరారయ్యే అవకాశం
- నిజామాబాద్‌లో మీడియాతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఈనెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో ఉండే అవకాశం ఉందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లోని ఆర్‌అండ్‌బీలో శనివారం విలేకరులతో జరిగిన చిట్‌చాట్‌లో పలు విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో వివిధ సమీకరణాల వల్లే మంత్రివర్గ విస్తరణ జాప్యం అవుతోందని అన్నారు. సీఎం, మంత్రులు అందరం కలిసే ఉన్నామని, కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తీర్చడమే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు మాత్రం తప్పుడు ప్రచారాలు మొదలు పెడుతున్నారని అన్నారు. సీఎంను మార్చాల్సిన అవసరం ఏముందని అందరిని కలుపుకొని పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారాన్ని చేస్తున్నారని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం స్థిరంగా ఉందని, తమ టార్గెట్ ఇచ్చిన హామీలను నెరవేర్చడమేనని అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పనులు చేస్తూ ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్ర పీసీసీ కార్యవర్గాన్ని ఈనెల 26 లేదా 27న ఖరారు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అన్ని పరిశీలించిన మీదటనే కూర్పులు చేస్తూ అందరికీ అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే చాలామంది సీనియర్లకు, జిల్లా అధ్యక్షులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లో అవకాశం కల్పించామని అన్నారు. ఆయా సామాజిక సమీకరణాలకు అనుగుణంగానే అందరికీ అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. ప్రతిపక్షపార్టీలనేతలు అన్నివిషయాలను వక్రీకరిస్తూ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మంత్రి కొండా సురేఖ వాఖ్యలను కూడా వక్రీకరించారని, ఆమె మాట్లాడిన విషయాన్ని మొత్తం పరిశీలించకుండా కొన్నివాఖ్యలను సోషల్‌మీడియాలో వైరల్ చేశారని అన్నారు. దీనిపై ఆమె వివరణ కూడా ఇచ్చారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన విషయాలనే ఆమె వెల్లడించారని అన్నారు. సోషల్‌మీడియాలో వక్రీకరిస్తూ తప్పుదోవ పట్టించి అసత్య ప్రచారాలు చేసిన వారిపై సైబర్ క్రైమ్‌లో కేసులు పెడుతున్నామని తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను కట్టడి చేసేందుకు ఒక చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. అటువంటి చట్టాన్ని రాష్ట్రంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. మహిళా కాంగ్రెస్ ఆందోళనలు సర్వసాధారణమని, తమ పార్టీలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వేరే పార్టీలో అంత ప్రాధాన్యత లేదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆ పార్టీకి రాష్ట్రంలో భవిష్యత్తు లేదన్నారు. ఆ పార్టీలో ప్రస్తుతం మూడు ముక్కలాట నడుస్తుందన్నారు. కవితకు కేసీఆర్‌కు, కవితకు కేటీఆర్‌కు, కేటీఆర్ హరీష్‌రావుకు మధ్య పంచాయతీ నడుస్తుందన్నారు. వీటన్నింటిని భరించలేకనే కేసీఆర్ ఫామౌజ్‌కు పరిమితం (తరువాయి 8వ పేజీలో..)



చిట్‌చాట్‌లో మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

బోధన్‌లో భారీ వర్షం

బోధన్‌రూరల్, మే17 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉండడంతో సాయంత్రం భారీగా వర్షం కురియడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో అరగంట పాటు విద్యుత్‌అంతరాయం ఏర్పడింది. పట్టణశివారులోని పలు గ్రామాలలో రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. భారీగా వర్షం పడడంతో ప్రజలకు ఉపశమనం లభించింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఇందూరులో తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మే17 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల ఘనవిజయం ఆపరేషన్ సిందూర్‌కు అద్దం పట్టేలా దేశ వ్యాప్తంగ చేపట్టిన తిరంగా ర్యాలీ ఈనెల 19న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ కన్వీనర్ జీవీ కృపాకర్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ సోమవారం జరిగే తిరంగా ర్యాలీని జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పహల్గాం ఘటనలో ఉగ్రవాదులు భారతీయులపై చేసిన దారుణహత్యలను దేశం మరిచిపోదన్నారు. ఈ ఘటనకు బదులుగా మోదీ నాయకత్వంలో భారతసైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపిందన్నారు. కాందహార్ హైజాకింగ్, పుల్వామా దాడుల్లో కీలకపాత్ర పోషించిన వ్యక్తులను హతమార్చడం ప్రత్యేకమన్నారు. పాకిస్థాన్ సామాన్యప్రజలపై కాకుండా కేవలం ఉగ్రవాదులపై టార్గెట్‌చేసిన విధానం భారత సైనిక నీతికి నిదర్శనమన్నారు. బ్రహ్మోస్, సుదర్శన్ ఎస్-400 వంటి ఆధునీకరణ రక్షణ వ్యవస్థలతో పాకిస్థాన్ డ్రోన్‌లను గాలిలోనే తరిమికొట్టిన తీరు ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందన్నారు. మేకిన్ ఇండియా ద్వారా స్వదేశీయంగా యుద్ధపరికరాల తయారీ అభివృద్ధి చెందుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా జాతీయ గౌరవానికి సంకేతంగా మనమూ దేశం కోసం నినాదంతో ఇందూరు నగరంలో భారీ తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4గంటలకు రాజరాజేంద్ర చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తిరంగా ర్యాలీ నిర్వాహకులు ఓంప్రకాష్ దయిమా, డాక్టర్ వెంకటరమణ, యాదగిరి, నర్సింహా, గజంఎల్లప్ప, పంచరెడ్డి ఎర్రన్న, స్వామి దాసు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో.. ఈకో టూరిజం అభివృద్ధికి చర్యలు

- అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా నిధుల విడుదల
- బ్యాక్‌వాటర్ పరిధిలోని మూడు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఏర్పాట్లు
- సఫారీ, బర్డ్‌వాచ్ కోసం ప్రత్యేక వసతులకు చర్యలు

నిజామాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈకో టూరిజం కింద నిధులను విడుదల చేయడంతోపాటు సఫారీ, బర్డ్‌వాచింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. బ్యాక్ వాటర్‌లో ఈకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తూనే చుట్టుపక్కల గ్రామాల యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. వారికి ఉపాధి కల్పించడంతో పాటు విడతల వారిగా మౌలిక వసతులను మెరుగు పర్చనున్నారు. రాష్ట్రఅటవీ అభివృద్ధి సంస్థ ద్వారా నిధులను వెచ్చించడంతో పాటు వేసవి కాలంలో పర్యాటకులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని నిధులు విడుదల చేయడంతో ప్రాథమికంగా పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఎస్సారెస్పీకి ఎక్కువ మొత్తంలో విదేశీ పక్షులు వస్తుండడంతో వాటిని చూసేందుకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే పర్యాటకాన్ని ప్రోత్సహించేలా అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ పనులను చేపడుతున్నారు. వచ్చే ఏడాది వేసవి వరకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రతీ ఏడాది నిండుగా ఎస్సారెస్పీ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రతీ సంవత్సరం నిండుతోంది. యాసంగి పంటకు నీటి విడుదల తర్వాతే బ్యాక్ వాటర్ తగ్గుతోంది. ఆ సమయంలోనే ఈ ప్రాంతానికి ఎక్కువ మొత్తంలో విదేశీ పక్షులు ప్రతీ యేడాది వస్తున్నాయి. మార్చి చివరి వారం నుంచి వాటి రాక మొదలై జూన్ రెండో వారం వరకు ఇక్కడే ఉంటున్నాయి. ఫ్లెమ్మింగ్ నుంచి ఇతర రకాల పక్షులు ఎక్కువగా ప్రతీ సంవత్సరం ఇక్కడికి వస్తున్నాయి. సుమారు రెండున్నర నెలల పాటు బ్యాక్ వాటర్ పరిధిలోనే ఉండి వర్షాలు మొదలై ప్రాజెక్టులోకి వరద వచ్చిన సమయంలో తిరిగి వెళ్తున్నాయి. వీటితోపాటు ఎస్సారెస్పీలో నీళ్లు తగ్గిన సమయంలో జింకలు,దుప్పులు, ఇతర జంతువులు ఎక్కువగా వస్తున్నాయి. వీటిని చూసేందుకు ప్రతి సంవత్సరం వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. జిల్లా వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చి చూసి వెళ్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా వీటి సందడి ఉంటుండడంతో ప్రతీ సంవత్సరం వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. బ్యాక్ వాటర్‌కు వెళ్లేందుకు సరైన దారిలేవు. ఆయా గ్రామాల పరిధి నుంచే పొలాల మార్గం ద్వారా వీటిని చూసేందుకు పర్యాటకులు వెళ్తున్నారు. ప్రభుత్వం తరఫున ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. బ్యాక్‌వాటర్‌కు వచ్చే పక్షులు, జంతువుల వేట జరుగకుండా మాత్రం అటవీశాఖ అధికారులు దృష్టిపెట్టారు. ఆ ప్రాంతాల్లో సిబ్బందిని ఉంచారు. వచ్చేవారి సంఖ్య పెరుగుతుండడంతో ఈకో టూరిజం కింద అభివృద్ధి చేస్తే పర్యాటకులకు ఉపయోగపడుతుందని భావించారు. గత సంవత్సరంలోనే ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా నిధులను వెచ్చించి అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్ పలు దఫాలు పర్యటించడంతో పాటు ప్రతిపాదనలు ఓకే అయ్యే విధంగా ప్రయత్నాలు చేశారు.



ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పక్షులు (ఫైల్)

ప్రతిపాదనలకు అనుగుణంగా..

జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఈకో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలకు అనుగుణంగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ పరిధిలోని గాదేపెల్లి, ఉమ్మెడ, జలాల్‌పూర్ గ్రామాల పరిధిలో ఈకో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. గత నెలలోనే అటవీశాఖకు సంబంధించిన ముఖ్యఅధికారి చంద్రశేఖర్‌రెడ్డి (తరువాయి 8వ పేజీలో..)

స్కూల్ బస్సుల ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

● బడి పిల్లల భద్రతపై రాజీ లేదు
● జిల్లా రవాణాశాఖ అధికారి ఉమామహేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వర్‌రావు

బోధన్‌రూరల్,మే17(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సుల ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, బడి పిల్లల భద్రతపై రాజీ పడే ప్రసక్తే లేదని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్ రావు అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ఇందూర్ పాఠశాలలో ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ, ట్రాఫిక్ శాఖ సంయుక్తంగా ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు, బస్సు డ్రైవర్లకు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్ల బాధ్యత, పాఠశాల యాజమానుల సహకారం మొదలైన అంశాల గురించి ఆయన వివరించారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు తమ బస్సులను నడిపించాలన్నారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులు అనుకోకుండా అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలా కాపాడుకోవాలో ప్రత్యక్షంగా ఆరు బయట చేసి చూపించారు. ఆక్సిడెంట్, వీడియో క్లిప్పింగ్ ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శింపజేసి బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారి సుభాష్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్, కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు వై.శ్రీనివాస్, బోధన్ అధ్యక్షులు హరికృష్ణలతో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, బస్సు డ్రైవర్లు, క్లీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల క్రయ విక్రయాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

● ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రేయ



ఎడపల్లిలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంఏఓ

ఎడపల్లి, మే17(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, జైతాపూర్, జానకంపేట సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రేయ, మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని ఎడపల్లి, మంగల్‌పాడ్, ధర్మారం, కుర్నాపల్లి గ్రామాలలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఉన్న ఎరువుల నిల్వలను వారు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ తనిఖీలో భాగంగా అన్ని రకాల ఎరువులను, స్టాక్ రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్‌లకు సరిపోయిందా లేదా అని పరిశీలించడం జరిగిందన్నారు. ఎరువులు క్రమ పద్దతిలో అమర్చాలని, ఎరువులు సరిపడా ఉండేట్లు చూసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని సేల్స్ మెన్‌లకు సూచించడం జరిగిందన్నారు. ఎరువులు కొన్న ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు సహకార సంఘం సేల్స్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నవీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలి

నవీపేట,మే17(ఆంధ్రజ్యోతి): నవీపేట ప్రధాన రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షులు సరిన్ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌ను కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఎంపీ ధర్మపురి అరవింద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. నవీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అరవింద్ హామీ ఇచ్చినట్లు సరిన్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవీపేట,మే17(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గారావు ఫారం సమీపంలో శుక్రవారం రాత్రి బైక్ వెళ్తున్న వ్యక్తికి అడవి పందులు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కింద పడగా ఎడపల్లి మండలం పోచారంకు చెందిన సుంకరి పోచయ్య(46)అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. నవీపేటలో జరిగిన వారంతపు సంతకు బైక్‌పై సుంకరి పోచయ్య వెళ్లాడని అదే రోజు రాత్రి బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జగ్గారావు ఫారం సమీపంలో అడవి పందులు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతును రాజును చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

● వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి



మెండోరలో మాట్లాడుతున్న నాయకులు

మెండోర , మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో రైతును రాజును చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వేల్పూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అనుసంధానంతో శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ మార్కెట్ కమిటి చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చేప్పే అవగాహన అంశాల విషయాలు తప్పకుండా పాటించాలని, తక్కువ యూరియా వాడుతూ సాగు ఖర్చును తగ్గించాలని, అనవసరం మేరకు రసాయనాలను వినియోగించలేని పంట మార్పిడి పాటించాలని సూచించారు.సుస్థిరా ఆదాయాన్ని పొంది, చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి అనే అంశాలను తప్పకుండా రైతులు పాటించాలని కోరారు.ఈకార్యక్రమంలో ఆర్ఈఏసీ మెంబర్ కొటపాటి నరసింహా నాయుడు, సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, శాస్త్రవేత్తలు రాజుకుమార్, అమల, అంజయ్య, వ్యవసాయ అధికారి వైష్ణవ్, ఉద్యాన అధికారి వినాయక, పశువైద్యాధికారి గౌతమ్‌రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో జీలుగ విత్తనాల పంపిణీ



పెర్కిట్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీలో శనివారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను రైతులకు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 10వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వస్తే ఇప్పటి వరకు 7500 క్వింటాళ్లు ఆయా మండలాలలో పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బోజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మాజీ కౌన్సిలర్లు రవిగౌడ్, ప్రసాద్, నాయకులు మానేటి లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ సొసైటీ ఆధ్వర్యంలో: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయశాఖ సంఘం ఆధ్వర్యంలో శనివారం మచ్చర్ల, దేగాం, ఆలూర్ గ్రామాలలో సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, ఏడీఏ విజయలక్ష్మీ, ఏవో రాంబాబు, సొసైటీ డైరెక్టర్లు కల్లెం భోజారెడ్డి, బార్ల సంతోష్‌రెడ్డి, లింగు గోవర్ధన్, కల్లెం సాయిరెడ్డి, ప్రమోద్ కుమార్, ఆరే రాజేశ్వర్, నర్సారెడ్డి, కట్ట నర్సయ్య, గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్, సీఈవో మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో శనివారం రైతులకు సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు 50 శాతం సబ్సిడీలపై 30 కిలోల బస్తా రూ.2137లకు చెల్లించి విత్తనాలు తీసుకువెళ్లాలని రైతులను కోరారు. ఒకబస్తా జీలుగ విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌పుస్తకాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, ఏఈవో శ్రీలత, సంఘ సభ్యులు భూమారెడ్డి, ముత్యాల లక్ష్మణ్,కుంటఅశోక్, పాల మల్లేష్, ఏఎంసీ డైరెక్టర్ మహిపాల్,కార్యదర్శికాశీరాం,సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో జీలుగు విత్తనాలను సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ రైతులకు రాయితీపై జీలుగు విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో జీలుగు విత్తనాలను అందజేస్తుందని రసాయన ఎరువులను తగ్గించి జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చంద, రవి, సాగర్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమ్‌గల్ రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): కారెపల్లి హను మాన్ తండాకు చెందిన గణపతి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. అదే విధంగా తాళ్లపల్లి గ్రామానికి చెందిన మోహన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను సునీల్‌రెడ్డి పరా మర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు న్నారు.

నల్లూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ముప్కాల్, మే17(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు కావడంతో శనివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా న్యాయాధికారి

ఆర్మూర్ రూరల్ , మే17(ఆంధ్రజ్యోతి):అంకాపూర్‌లో పొద్దుటూరి సదానందరెడ్డి వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లా డుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత కన్నపిల్లలపై ఉం దన్నారు. వృద్ధాప్యంలో వారిని ప్రేమగా చూడాలని వృద్ధులు చిన్నపిల్లల మనస్థత్వం కలిగి ఉంటారని వారిని గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు , బాబాగౌడ్, నివేదిన్ గుజరాతి, అశోక్, సుదర్శన్‌గౌడ్, మేనేజర్ రాజన్న, న్యాయసేవ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీల పంపిణీ

ముప్కాల్, మే17(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసి డింగ్ కాపీలను శనివారం వేల్పూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ జైడి చంద రవి లబ్ధిదారులకు అందజేశారు. ప్రొసిడింగ్ కార్డులను మంజూరు చేయిం చిన నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌ఖేత్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు బద్దం సాగర్, పంచాయితీ సెక్రెటరీ రాజు, ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు నర్సారెడ్డి, లక్ష్మణ్, తిరుపతి రెడ్డి, మహిపాల్, గంగారెడ్డి, కిశోర్, రాజరెడ్డి, నడ్పిబావన్న, తదితరులు పాల్గొన్నారు.

జులై 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలి

ఎడపల్లి, మే17(ఆంధ్రజ్యోతి):పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న చేపట్ట దలచిన దేశ వ్యాప్త సమ్మె వాయిదా పడడంతో జులై 9న సమ్మె చేపడుతున్నట్లు గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జొగ్గరి పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌నాయకులు లక్ష్మిమల్లమ్మ, గంగారాం ఉన్నారు.

ఎంపీ నిధులతో సంఘ భవన నిర్మాణ పనులకు భూమి పూజ

కమ్మర్‌పల్లి,మే 17: (ఆంధ్రజ్యోతి)మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంవద్ద సంఘభవన నిర్మాణ పనులకు శనివారం గౌడసంఘ సభ్యులు,బీజేపీ నాయకులు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రెంజర్ల గంగాధర్, చింత ప్రవీన్, వడ్ల మోహన్, కే శేఖర్, కొత్తపల్లి గణేష్, గౌడ సంఘ సభ్యులు శేఖర్, ఇటిక్యాల ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

మేకల సంతలో తాగునీటి ఏర్పాటు



నవీపేట మేకల సంతలో క్రయ, విక్రయదారులకు తాగునీటి వసతి ఏర్పాటు చేసిన దృశ్యం

నవీపేట,మే17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే మేకల సంతలో గ్రామ పంచాయతీ అధికారులు తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుండి మేకల సంతకు పెద్ద ఎత్తున క్రయ, విక్రయదారులు వస్తుంటారు. ప్రతి శనివారం సంతకు 10 నుండి 15వేల వరకు మేకలు, గొర్రెలు సంతకు తరలిస్తుంటారు. సంతలో తాగునీటి ఏర్పాటు లేకపోవడంతో జీవాలతో పాటు అమ్మకందారులు, కొనుగోలుదారులు సైతం తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు.ఈ నెల 11న ఆంధ్రజ్యోతి దినపత్రికలో "మేకల సంతలో తాగునీటి కొరత" అనే వార్తకు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. సంతకు వచ్చిన అమ్మకందారులు, కొనుగోలుదారులకు డబ్బాలలో చల్లటి తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. అలాగే సంతకు తరలించిన జీవాలకు సైతం ప్లాస్టిక్ డబ్బాలలో తాగునీటిని అందుబాటులో ఉంచారు. మేకల సంతలో తాగునీటి వసతి ఏర్పాటుకు కృషి చేసిన ఆంధ్రజ్యోతి దినపత్రికకు మేకల అమ్మకందారులు, కొనుగోలుదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్, చట్టాలపై అవగాహన



అంబంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కోటగిరి,మే17(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో శనివారం ట్రాఫిక్ రూల్స్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయన్న మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్‌లో ప్రాణపాయం నుంచి తప్పించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిస కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలై డబ్బులు పొగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటూ కుటుంబాలలో తీరని వేదన మిగిలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం రుద్రూరు మండల కేంద్రంలో ట్రాఫిక్ రూల్స్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారాం, సాయిలు, లింగం, చిట్టిబాబు, పోలీసు సిబ్బంది సురేష్, రాజు, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా

నవీపేట,మే17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె తాత్కాలికంగా వాయిదా పడిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వచ్చే జూలై 9కి వాయిదా వేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్మిక వర్గం, అసంఘటిత కార్మికులు, రైతు సంఘాల నిర్ణయం మేరకు ఈ సార్వత్రిక సమ్మె వాయిదా వేయడం జరిగిందని అఖిల భారత కార్మిక సంఘాలు స్వాతంత్ర ఫెడరేషన్‌లో తెలిపినట్లు ఆయన వివరించారు.

తడిసిన వరిధాన్యం

ఆర్మూర్‌టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దోబీఘాట్, పిప్రి రోడ్డులలో గల వరిధాన్యం అకాలవర్షానికి తడిసిపోయింది. శుక్రవారం అర్థరాత్రి అకాలవర్షం రావడంతో ఆరబెట్టి ఉంచిన వరిధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు భయాందోళనకు గురవు తు న్నారు. తడిసి ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకున్నారు. మళ్లీ అకాలవర్షం వస్తే నష్టం వాటిల్లు తుందని అధికారులు వరిధాన్యాన్ని కొనుగోలు అయ్యేలా చూడాలని వేడుకుంటున్నారు.

కల్వర్టు పనులను చేపట్టిన మున్సిపాలిటీ సిబ్బంది



కల్వర్టు నిర్మాణ పనులను చేపడుతున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్, మే17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 35వ వార్డు హుస్నాబాద్ కాలనీలో కల్వర్టు నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ అధికారులు చేపట్టారు. గతనెల 13న "కల్వర్టుపై గుంతను పూడ్చండి సారు" అనే కథనానికి మున్సిపల్ కమీషనర్ రాజు స్పందిం చి కల్వర్టు పనులను పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం కల్వర్టును నూతనంగా నిర్మించాలని మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ. 2లక్షలు నిర్మాణానికి కేటాయించారు. దీంతో కాంట్రాక్టర్ టెండర్‌ను దక్కించుకుని కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేసి వార్తను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు.

ఈటలపై చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాసాడ నర్సింగ్ ముదిరాజ్

ఆర్మూర్ టౌన్, మే17(ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిలు ఎంపీ ఈటెల రాజేందర్‌పై చేసిన వాఖ్యాలను వెనక్కి తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు యాసాడ నర్సింగ్ ముదిరాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక వహించిన ఈటలను విమర్శిస్తే ఊరు కునేది లేదని రాష్ట్రంలో ఉన్న 60 లక్షల ముదిరాజ్‌లకు అండగా ఉన్న ఈటెలను పక్కకు తప్పించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని లేదంటే పుట్టగతులు లేకుండా పోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ యువజన అధ్యక్షుడు మందుల బాలు, గౌరవ అధ్యక్షుడు ఎల్లన్న, శీల శ్రీనివాస్, జక్కం కార్తీక్, తాడు ప్రసాద్, మందుల పోశెట్టి, బోజన్న, మందుల గంగారాం, సొంబడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి కొలతలు లేకుండా ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

ఏఐయూకేఎస్ నాయకుడు సారా సురేష్ డిమాండ్

కమ్మర్‌పల్లి,మే 17(ఆంధ్రజ్యోతి):కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న మహాత్మ గాంధీ జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు ఎలాంటి కొలతలు లేకుండా 200 రోజుల పని కల్పించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అమీర్‌నగర్ గ్రామశివారులోని అటవి ప్రాంతంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనుల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గతంలో కొలతలు లేకుండా పనులచేయించేవారని ఉపాధి కూలీల చేత చెరువుల పూడికతీత పనులు చేయించి రైతులకు సరఫరాచేయించేవారని ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చి కూలీల కొలతలు మారాయని రళ్లరప్పల మధ్య, గుట్టలపై పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ముత్తన్న, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

రెంజల్,మే17(ఆంధ్రజ్యోతి): గత పదిహేను రోజుల క్రితం మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన గాండ్ల నారాయణ ఇంట్లో తాళం వేసి నిర్మల్‌లోని చుట్టాల ఇంటికి శుభకార్యానికి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో తాళం పగులగొట్టి దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరిగిందని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడుతున్న సుంకిని గ్రామానికి చెందిన రాజు, కామారెడ్డికి చెందిన కర్నెలింగం అనే ఇద్దరు వ్యక్తులు ఏప్రిల్ 15వ తేదిన బోర్గాంకు చెందిన గుండ్ల నారాయణ ఇంట్లో దొంగతనానికి పాల్పడంతో శనివారం రెంజల్ పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 1.5గ్రాముల బంగారం, పదిగ్రాముల వెండి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని జైలుకు పంపించడం జరిగిందని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. దొంగలను పట్టుకోవడానికి కృషి చేసిన ఏఎస్ఐ బాబురావు, కానిస్టేబుల్ విశాల్, రణధీర్‌లను ఎస్సై అభినందించారు.

అర్హులైన పేదలకే ఇళ్లు కేటాయించాలని నిరసన

ఆర్మూర్ రూరల్ , మే17(ఆంధ్రజ్యోతి) : ఆర్మూర్ మండలం ఫత్తెపూర్ గ్రామంలో ఇందిర మ్మ ఇండ్లు అర్హులైన పేదలకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రామస్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు మై లారం రాము, తిరుపతి, ప్రకాష్, దేవకుమార్, ప్రసాద్, గంగాధర్, ఇందిరమ్మ ఇండ్ల ఆశావాహులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్ కుమార్

కమ్మర్‌పల్లి, మే 17: (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు బాధిత కుటుంబాలను బాల్కొండ కాంగ్రెస్ నియోజికవర్గ ఇన్ చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, పూడిగెల ప్రవీన్, సంజీవ్ యాదవ్, కొమ్ముల రాజేందర్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు నమోదు

నిజామాబాద్ అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎటువంటి డాక్టరేట్ పట్టా లేకుండా ఆస్పత్రులు నడుపుతున్న ఇద్దరు నకిలీ వైద్యులపై శనివారం కేసు నమోదు చేశామని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నగరంలోని బోధన్ రోడ్‌లో ఉన్నటువంటి ఫస్ట్ ఎయిడ్ హాస్పిటల్ నడుపుతున్న సందాని, ఖలీల్‌వాడిలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో ఉన్న నకిలీ వైద్యుడు దొడ్డిమంటి సతీష్ ఎటువంటి డాక్టరేట్ పట్టా లేకుండా నిజామాబాద్‌లో ఆస్పత్రులు నడుపుతూ రోగులకు వైద్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఇంజక్షన్‌లు ఐవీ ఫ్లూట్స్ ఎక్కిస్తున్నట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వర స్వామి మహోత్సవాలు

జక్రాన్‌పల్లి, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలోని శనివారం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం మహోత్సవాలను భక్తులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు , విడిసి సభ్యులు, భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు

బోధన్‌రూరల్,మే17(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శ్రీ లక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలలో శనివారం మూలమంత్ర హోమం కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మూల హోమం, నిత్య పూర్ణాహుతి, సహస్ర పారాయణం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీని కలిసిన బీజేపీ మండల అధ్యక్షుడు

రెంజల్,మే17(ఆంధ్రజ్యోతి): బీజేపీ నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు శనివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ధర్మపురి అరవింద్‌ను కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వివిధ మండలాల నూతన అధ్యక్షులు ఎంపీని కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చర్చించడం జరిగిందని మండల అధ్యక్షులు యోగేష్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

బోధన్‌రూరల్,మే17(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున మంజీర సరిహద్దు గ్రామాల నుండి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండెపోటుతో బీజేపీ కార్యకర్త మృతి

బోధన్‌రూరల్,మే17(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని 16వ వార్డు రంగర్‌గల్లీకి చెందిన బీజేపీ కార్యకర్త మల్లెపూల గంగాధర్(40) శనివారం గుండెపోటుతో మృతి చెందినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ తెలిపారు. మృతుడు మల్లెపూల గంగాధర్ వరికోత మిషన్‌లో పని చేస్తాడని, శనివారం గుంటూరుజిల్లా నరసరావుపేటలో మధ్యాహ్నం భోజనం పార్సల్ తీసుకుని వస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు.మల్లెపూల గంగాధర్ బీజేపీ పార్టీలో చురుకైనకార్యకర్త అని,ఆయనపార్టీ కోసం చేసిన కృషిని కొనియాడారు. ఆయన కుటుంబాన్ని భగవంతుడు ధైర్యానివ్వాలని కోరారు.



మహేష్‌కు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆలయాల్లో మహేష్ కుమార్‌గౌడ్ పూజలు

నిజామాబాద్ అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ శనివారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పోచమ్మగల్లి, గోల్‌హన్మాన్ ఆలయాల్లో కుటుంబ సమేతంగా ప్రత్యేకపూజలు చేశారు. తన పెళ్లిరోజు సందర్భంగా ఆయన సతీమణి సంధ్యతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ కార్యదర్శి నగేష్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, నాయకులు దయాకర్ గౌడ్, బంటుబలరాం, నాగరాజు, తదితరులు ఆయనకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

డిచ్‌పల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 6896 మందికి గాను 6339మంది హాజరయ్యారని, 557మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 6110 మందికి గాను 5641 మంది హాజరుకాగా 468మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు. ఆర్మూర్ నరేంద్ర డిగ్రీ కళాశాలలో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ ఒకరు డిబార్ అయినట్లు తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్ పరీక్ష కేంద్రాల్లో ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణ అధికారి సంపత్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. కామారెడ్డి పరీక్ష కేంద్రంలో మరో రెండు ప్రత్యేక స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.

అల్ప్రాజోలం పట్టివేత: ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్,మే17(ఆంధ్రజ్యోతి): నిషేధిత మత్తుపదార్థాలు అల్ప్రాజోలం విక్రయిస్తున్న ఒకరిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న తెలిపారు. బోధన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బెల్లాల్ గ్రామంలో నమ్మదగిన సమాచారం మేరకు వీరాగౌడ్ ఇంటిలో సోదాలు నిర్వహించగా 264గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరాగౌడ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యల నిమిత్తం ఎక్సైజ్ స్టేషన్ బోధన్‌కు అప్పజెప్పడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు నర్సింహాచారి, రాంకుమార్, సిబ్బంది నారాయణరెడ్డి, రాజన్న, రాంబచ్చన్, తదితరులు పాల్గొన్నారు.

25 గ్రాముల గంజాయి పట్టివేత: ఒకరి అరెస్టు

మోపాల్, మే17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బామన్ మహదూర్ సింగ్ బైక్‌పై అక్రమంగా 25 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. గాంధారిలోని చెద్మల్ నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై ప్లాస్టిక్ కవర్‌లో పెట్టుకొని తరలిస్తుండగా తాము పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే17 (ఆంధ్రజ్యోతి): ధైర్య సాహసాలను ప్రదర్శించి, ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థలకు 2025-26 సంవత్సరానికి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ భారత ప్రభుత్వము ప్రదానం చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి, మహిళాశిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ షేక్ రసూల్ బీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక, విజ్ఞాన నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభా పాటవాలు, ఆటలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్యసాహస కార్యక్రమాలు, తదితర అంశాలకు ఈఅవార్డులు ప్రధానం చేస్తామని పేర్కొన్నారు. అవార్డులకు 5 నుంచి 18ఏళ్లలోపు బాలబాలికలు అర్హులన్నారు. అర్హులైన బాలబాలికలు దరఖాస్తులను వెబ్‌సైట్: అవార్డ్స్‌జీవోవీ.ఇన్‌లో ఈనెల 31తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

దళిత అవార్డు అందుకున్న రాజ్‌గగన్

సుభాష్‌నగర్, మే17 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం దళిత ఉన్నతిలో పాటుపడుతున్న వారికి గౌరవ సూచకంగా ఇస్తున్న దళితరత్న అవార్డు రాజ్‌గగన్‌కు వరించింది. సికింద్రబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజ్‌గగన్‌కు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో మాదిగ దండోర నాయకులు సల్లాని శివ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నియామక పత్రాల అందజేత

ఇందల్వాయి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 37 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నియామక పత్రాలను ఎంపీడీవో అనంత్‌రావు శనివారం అందజేశారు. ఎన్నోఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరింది. దీంతో లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డికి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కొరట్‌పల్లి ఆనంద్, పంచాయతీ కార్యదర్శి భరత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సైందర్, రవి, ప్రకాశ్, ప్రసాద్, రాజన్న, కాంగ్రెస్ పార్టీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం

ధర్పల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శనివారం ఇంజనీరింగ్ అధికారులు మార్క్‌ఔట్ ఇచ్చారు. మండలంలోని సీతాయిపేట గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి అక్కడ ఇందిరమ్మ ఇళ్లను లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని అన్నిగ్రామాల్లో అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను ఎంపికచేశారు. శనివారం నుంచి ఇంజనీరింగ్ అధికారులు మార్క్‌ఔట్ఇచ్చి ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించి అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, ధర్పల్లి సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున్, తదితరులున్నారు.

ఎరువుల గోదామును తనిఖీ చేసిన తహసీల్దార్

ఇందల్వాయి, మే17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి, ఇందల్వాయి సహకార సంఘాల్లో ఎరువుల గోదాములను తహసీల్దార్ వెంకట్రావ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, అమ్మకం పని తీరు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎరువులు అమ్మిన ప్రతీ రైతుకు నగదు రశీదు ఇవ్వాలని, ప్రతీ కొనుగోలును పీవోఎస్ మిషన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎరువులను నిర్దేశించిన ధరకంటే అధికంగా అమ్మవద్దని ఎరువుల నిల్వల వివరాలను గోదాం బయట రైతులకు అర్థమయ్యేలా ప్రదర్శించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్లు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

సిరికొండ, మే17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లిన నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేసి ఏడాకి 12వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కారదర్శి రమేష్, తదితరులు ఉన్నారు.

నల్లమట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన టిప్పర్లు
- నల్లమట్టిని తరలించొద్దని మంచిప్ప చెరువు వద్దకు చేరుకున్న గ్రామప్రజలు



మంచిప్పలో నల్లమట్టి టిప్పర్లను ఆపిన గ్రామస్థులు

మోపాల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచిప్ప చెరువులోంచి నల్లమట్టిని తరలించొద్దని గ్రామస్థులు శనివారం సాయంత్రం వాహనాలను అడ్డుకున్నారు. తమ చెరువులోంచి నల్లమట్టిని తరలించడాన్ని వ్యతిరేకిస్తూ వంద మంది గ్రామస్థులు అక్కడికి చేరుకొని టిప్పర్లను వెనక్కి పంపించారు. గతకొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా నల్లమట్టిని తరలించడాన్ని గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు. టిప్పర్ల అతివేగం, అజాగ్రత్తగా నడుపుతున్నారని గ్రామస్థులు మండిపడ్డారు. తమ చెరువులోంచి తీసిన మట్టిని ఇటుక బట్టీలకు అధికార పార్టీ నాయకులు తరలించడం పట్ల మండిపడుతున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా చెరువులోకి ప్రొక్లెయినర్‌లను దింపి టిప్పర్ల ద్వారా పెద్దఎత్తున మట్టిని తరలిస్తున్నారు. ఇక నుంచి చెరువులోంచి మట్టిని తీయవద్దని హెచ్చరించారు. అక్కడున్న సుమారు 25 నుంచి 30 టిప్పర్లను వెనక్కి పంపించారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా నల్లమట్టిని తరలిస్తే పెద్దఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. వీడీసీ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్థులు పెద్దఎత్తున చెరువు వద్దకు చేరుకున్నారు. నల్లమట్టి తరలింపు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులే పెద్దఎత్తున మట్టి తరలింపు సహకరిస్తున్నారని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఇకనైనా ఈ మట్టి తరలింపు ఆగుతుందా కొనసాగుతుందా అనేది చర్చనీయాంశమైంది. ఈ మట్టి తరలింపు మంచిప్ప చెరువుతో పాటు మోపాల్ ఖజానా చెరువులోంచి కూడా మట్టిని తరలిస్తున్నారు. మండలంలో ఇటుకబట్టీలు ఎక్కువగా ఉండటంతో ప్రతీ సంవత్సరం వేసవి కాలంలో మట్టి తరలింపును కొనసాగిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటుందో ఆ పార్టీ నాయకులే ఈనల్లమట్టిని తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

గిరిరాజ్‌లో దోస్త్ సహాయ కేంద్రం ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్, మే17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి గాను దోస్త్ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా డిగ్రీ ప్రవేశాల యొక్క రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ అడ్మిషన్లకు సంబంధించిన సహాయకేంద్రం గిరిరాజ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థినీ విద్యార్థులకు బీఏ, బీకాం, బీఎస్సీ బీబీఏ, బీసీఏ, ఎమ్మెస్సీ డాటాసైన్స్ కోర్సులతో పాటు నూతనంగా అందుబాటులోకి వచ్చిన మమూడు వృత్తిపర పరమైన కోర్సులతో కలిపి మొదటి సంవత్సరంలో 1,860 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతుందని, కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత విద్యారంగంలోనూ, క్యాంపస్ ప్లేస్మెంట్లలోనూ అద్భుతంగా రాణిస్తున్నారనీ, కళాశాలకు విశిష్టమైన ఐఎస్‌ఓ, (న్యాక్) గుర్తింపు ఉన్నట్లు తెలిపారు. నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి లాంటి చుట్టుపక్కల జిల్లాలకు సంబంధించిన విద్యార్థులు గిరిరాజ్ కళాశాలలో అడ్మిషన్ పొందే సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించి విద్యార్థుల కోసం ఉచిత సలహాలు సూచనల సహాయకేంద్రం కళాశాలలో పనిచేస్తోందని, సహాయం కేంద్రం కోసం విద్యార్థులు కళాశాలలో నేరుగా లేదా ఈ 9440019918, 9059344379 కు సంప్రదించాలని సూచించారు.

జీవనశైలి మార్పుతోనే రక్తపోటు నియంత్రణ



మాట్లాడుతున్న డాక్టర్ తుకారం రాథోడ్

నిజామాబాద్ అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ జీవనశైలిని మార్చుకుంటేనే అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు నియంత్రణ దినోత్సవంలో భాగంగా శనివారం అర్సపల్లి పట్టణ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న జీవనశైలితో ఎక్కువమందికి అధిక రక్తపోటు ఉంటుందని అన్నారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆహారాన్ని పరిమిత స్థాయిలో తీసుకోవాలని అన్నారు. బేకరీ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, నిలువ ఆహార పదార్థాలను తీసుకోవద్దన్నారు. శారీరక వ్యాయామం, నడక, యోగా, ప్రాణాయామం లాంటివి ప్రతీరోజు క్రమం తప్పకుండా 30 నిమిషాల నుంచి గంట వరకు చేయాలన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆటలు ఆడటంతోపాటు రీడింగ్, పాటలు వినడం, ఇతర వ్యాపకాలను ఏర్పర్చుకోవాలన్నారు. ఆహార నియమాలను మార్పు చేసుకుంటూ శారీరక క్షేమ ఉండే విధంగా చూడాలన్నారు. అప్పుడే అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుందన్నారు. రక్తపోటు ఎక్కువైతే దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయన్నారు. మెదడులో రక్తస్రావం, గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధులు, కంటిచూపు మందలించడం, రక్తనాళాలు దెబ్బతినడం వంటివి జరుగుతాయన్నారు. జీవన శైలి మార్చుకుంటే అన్నింటిని తప్పించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్రామాట్ యాదవ్, అజ్మత్ ఉన్నీసా బేగం, వెంకటేశ్, వైద్య సిబ్బంది రాజేశ్వర్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, వెంకటేశ్, గోవర్ధన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

(5వ పేజీ తరువాయి)

అయ్యారని ఆయన ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆయన అన్నారు. బీజేపీ నేత కావాలనే కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు గుప్పించారని అన్నారు. ఆ రెండు పార్టీలే కలిసి పని చేస్తున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో చేసిన కులగణన కేంద్రానికి మోడల్‌గా మారిందన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీతో పాటు ఇతరుల వివరాలన్నీ పూర్తిస్థాయిలో తీసుకున్నామన్నారు. రిజర్వేషన్లను అమలు చేసేందుకు కేంద్రానికి పంపించాలని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం కూడా తీసుకుంటామని తెలిపారు. ఈ చిట్‌చాట్‌లో రాష్ట్ర వ్యవసాయ రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ సీనియర్ నేత రత్నాకర్‌తో పాటు పలువురు నేతలు ఉన్నారు.

'20న నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయండి'

నిజామాబాద్ కల్చరల్, మే17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాలను విజయవతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఓమయ్య పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చక్రపాణి, సీఐటీయూ నాయకులు రమేష్‌బాబు, తదితరులున్నారు.

భావితరాలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ అడ్డుకోవాలి

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

సుభాష్‌నగర్, మే17(ఆంధ్రజ్యోతి): మాలల భావితరాలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మాలమహా నాడు కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు దేవీదాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ మాలలకు ఏ పార్టీ నాయకులూ మద్దతు ఇవ్వలేదని, అన్యాయం జరిగిందని కూడా ఏ పార్టీ అనలేదని అన్నారు. అన్నిరంగాల్లో మాదిగలే ముందున్నారన్నారు. వర్గీకరణ చేయమని సుప్రీంకోర్టు ఎప్పుడూ చెప్పలేదని కేవలం సూచనలు మాత్రమే చేసిందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేస్తేపేరు వస్తుందని ఎస్సీ వర్గీకరణ చేశాడన్నారు. నిజమైన అంబేద్కర్ వారసులు మాలలే అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు హయాంలో వర్గీకరణ చేసి మాలలకు వ్యతిరేకంగా పనిచేశాడన్నారు. మాలల పంతం-చం ద్రబాబు అంతం అనే నినాదంతో బయలుదేరిన మాలలపై చంద్రబాబు లాఠీచార్జి చేశాడని అన్నారు. 600లకు పైగా మాలలు ఆసుపత్రుల పాలయ్యారని అన్నారు. 20వేల నోటికాడి జాబ్‌లు పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మాలలు ఐక్యంగా ఉండి వర్గీకరణను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేష్, రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఆనంపల్లి ఎల్లయ్య, ఎడ్ల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ కుమార్, కోశాధికారి రాజన్న, రాష్ట్ర అంసా అధ్యక్షుడు అంగరి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌లో పాల్గొన్న వైద్యులు

నగరంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 2కే రన్

నిజామాబాద్ అర్బన్, మే17 (ఆంధ్రజ్యోతి): హైపర్ టెన్షన్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర అనారోగ్య సమస్యల బారినపడే ఆస్కారం ఉందని మెడికవర్ ఆసుపత్రి వైద్యుడు సందీప్‌రావు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట చౌరస్తా సమీపంలో గల మెడికవర్ హాస్పిటల్స్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మెడికవర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సురేష్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ అవగాహన ర్యాలీ ఎల్లమ్మ గుట్ట చౌరస్తా ఎన్టీఆర్ చౌరస్తా కోర్టుచౌరస్తా మీదుగా పులాంగ్ చౌరస్తా నుంచి కొనసాగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఇంటర్వెన్షన్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సందీప్‌రావు, వైద్యులు మాట్లాడుతూ హైపర్ టెన్షన్‌పై అవగాహన కోసం నిజామాబాద్ నగరంలోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మే17ను ప్రపంచ హైపర్ టెన్షన్ నివారణ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో ప్రముఖ ఓపెన్ హార్ట్ సర్జన్ డాక్టర్ అవిన్ సనార్, న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీకృష్ణఆదిత్య, నెఫ్రాలజిస్ట్ డాక్టర్‌అజయ్‌కుమార్ విశ్వనాథ్ పాటిల్ తదితరులున్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

మోపాల్, మే 17 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు ఆరోగ్యంగా ఉండాల ంటే డాక్టర్ల సూచనలను పాటించాలని వైద్యఆరోగ్య సిబ్బంది సూచిం చారు. మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో శనివారం పిల్లలకు టీకాలిచ్చారు. పిల్లలకు పౌష్టిక ఆహారం ఇవ్వాలని పిల్లలు పెరిగేంత వరకు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పుష్ప, సంపూర్ణ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే జిల్లా రికార్డు

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో వేశారు. ధాన్యం కొనుగోలుతోపాటు డబ్బుల చెల్లింపులు అదే రీతిలో చేస్తున్నారు. మిగతా డబ్బులు 275 కోట్లు వారం రోజుల్లోపూ జమ చేసే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

రెండింతల ధాన్యం సేకరణ

గత యాసంగితో పోల్చుకుంటే జిల్లాలో దాదాపు రెండింతల ధాన్యం సేకరించారు. గత సంవత్సరం యాసంగిలో జిల్లాలో 4లక్షల 23వేల 308 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగా ఈ సంవత్సరం మాత్రం డబుల్ చేశారు. ఇప్పటి వరకు 8లక్షల 1019 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన అధికారులు మరో 40వేల మెట్రిక్ టన్నులు సేకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ వారంలోపు కొనుగోళ్లను పూర్తిచేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సంవత్సరం ధాన్యం కొనుగోళ్లలో జిల్లా ముందు స్థానంలో నిలువగా అధికారులు మాత్రం కేటాయింపులు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని సుమారు 228 మిల్లులకు కేటాయింపులు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో ధాన్యాన్ని తరలించేందుకు తిప్పలు పడ్డారు. ఎప్పుడు లేని విధంగా భారీగా ధాన్యం కొనుగోలు చేయడంతో మిల్లులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డబ్బుల కేటాయింపులు చేశారు. బాయిల్డ్ మిల్లులకు ఎక్కువ అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేసిన ధాన్యం కొన్ని మిల్లుల యజమానులు స్థలం సరిపోక నిరాకరించిన ప్రైవేటు గోదాములు, మార్కెట్ యార్డుల్లో నిలువ ఉంచారు. ఆయా మిల్లులకు కేటాయింపులు చేస్తూ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చూశారు. జిల్లాలో ఎన్ని ఇబ్బందులు వచ్చినవాటిని పరిష్కరించుకుంటూ ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తున్నామని జిల్లాపౌరసరఫరాల అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, అర్వింద్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కొనుగోలు చేశామన్నారు. రాష్ట్రస్థాయిలోనూ ధాన్యంసేకరణలో జిల్లా ముందుందని తెలిపారు. మిగతా ధాన్యాన్ని కూడా వారం రోజుల్లో పూర్తి చేసే విధంగా ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు.

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

(5వ పేజీ తరువాయి)

లారీల కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. హమాలీల కొరత ఎక్కువగా ఉండటం వల్ల సమస్యలు వస్తున్నాయని అన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. అకాల వర్షం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చూడాలన్నారు. పారా బాయిల్డ్ మిల్లుల్లో బియ్యం కేటాయింపుల్లో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆయన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడారు. మిల్లర్లు సహకరించాలని కోరారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లర్లు ధాన్యాన్ని దించుకోవాలని కోరారు. పూర్తిస్థాయిలో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తామని ఏ రైతుకు ఇబ్బంది కలుగకుండా చూస్తామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు చేపట్టిన విధానాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వివరించారు. ఇప్పటి వరకు 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. మిగతా ధాన్యాన్ని కూడా త్వరగా కొనుగోలు చేస్తామని రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నుడా చైర్మన్ కేశవేణు, పౌరసరఫరాల అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, అర్వింద్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ దిలీప్, వ్యవసాయ శాఖ అధికారి వీరయ్య, సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌తోపాటు మిల్లుల యజమానులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ఈకో టూరిజం అభివృద్ధికి చర్యలు

(5వ పేజీ తరువాయి)

తోపాటు అటవీ అభివృద్ధి సంస్థ ఎండీ సునీత భగవత్ వచ్చివెళారు. అన్ని అనుకూలంగా ఉండడంతో ఈకో టూరిజం కింద మొదటి విడతలో 1.75కోట్లు నిధులను విడుదల చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనిధులను వెచ్చించి ప్రాథమికంగా వసతులను కల్పించడంతో పాటు పర్యాటకానికి వచ్చేవారికి మౌలిక వసతులను కల్పించేలా ఏర్పాట్లను చేయనున్నారు. ఈ మూడుగ్రామాల పరిధిలో ఈకో టూరిజం కిందపక్షులను, వన్యప్రాణులను చూసేందుకు సఫారిని ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక వాహనాలను కొనుగోలు చేయడంతో పాటు వాటిద్వారా పర్యాటకులు తిరిగిచూసేలా ఈ వాహనాలను ఉపయోగించనున్నారు. సఫారీతోపాటు బర్డ్‌వాచింగ్ కోసం కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిర్మాణాలు చేపట్టనున్నారు. వీటిపైన కూర్చొని పక్షులను చూసే అవకాశాన్ని కల్పిస్తారు. ప్రత్యేక వాచ్‌టవర్‌లను బ్యాక్‌వాటర్ పరిధిలో నిర్మాణం చేపట్టనున్నారు. ఇవేకాకుండా ఈ గ్రామాల పరిధిలోని యువతకు ఈకో టూరిజం కింద శిక్షణ ఇచ్చే విధంగా ఏర్పాట్లను చేపట్టనున్నారు. మొదటివిడత కింద వచ్చిన నిధులతో ప్రాథమికంగా ఈ వసతులను కల్పించి తర్వాత దశలలో బ్యాక్‌వాటర్ పరిధిలో రిసార్టులు చేపట్టనున్నారు. రాష్ట్రఅటవీఅభివృద్ధి సంస్థద్వారా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిధులను వినియోగించి అభివృద్ధి చేసేలా మరిన్ని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. వర్షాకాలానికి ఇంకా కొద్దిరోజులే ఉండడంతో వచ్చేవేసవి వరకు ఈఏర్పాట్లను చేయనున్నారు. ఈనిధులను వెచ్చించి ఆయాగ్రామాల పరిధిలో వసతులను కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ పరిధిలో ఈకోటూరిజం కింద అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా అటవీశాఖఅధికారి వికాస్‌మీనా తెలిపారు. పూర్తి స్థాయిలో వసతులను కల్పిస్తే ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ భవిష్యత్తులో టూరిజం హబ్‌గా మారే అవకాశం ఉంది.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.250	రూ. 270





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.95,800	రూ.88,200	రూ.1015

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (10.10) సింగిల్ (1.40, 7.55), మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (4.25, 10.40)

స్క్రీన్-2 : శుభం (11.25), లవ్‌లీ (2.05) సింగిల్ (4.35), మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (7.20), డెవిల్స్ డబుల్ నెక్స్ లెవల్ (10.50)

స్క్రీన్-3 : లెవన్ (10.40), యమదొంగ (1.35) 23 (5.15), శుభం (8.05) ఫైనల్ డిస్టినేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (10.45)

స్క్రీన్-4 : ఫైనల్ డిస్టినేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (11.20, 1.50), హిట్-3 (4.20, 10.05) ఫైనల్ డిస్టినేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (7.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సింగిల్ (1.30, 7.30) : యమదొంగ (4.10, 10.30)

స్క్రీన్-2 : సింగిల్ (11.00 4.30, 10.30) : హిట్-3 (1.30, 7.20)

స్క్రీన్-3 : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (10.20, 1.30, 4.30, 7.30, 10.40)

లలితామహల్ : యమదొంగ (11.15, 2.15, 6.15, 9.15)

దేవి : సింగిల్ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : హిట్-3 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్